సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 14 । జులై । 2025



పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారికి.. కన్నీటి వీడ్కోలు

శెట్టిగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బావమరదలు మృతి చెందారు. వారి మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. - 8లో



వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.4 /27.8

జిల్లాలో ఆదివారం 27.8 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 23.91 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

20న జిల్లాస్థాయి హిందీ వ్యాసరచన పోటీలు

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణం నూనెవారిపల్లెలో ఉన్న బీవీఎస్ పాఠశాలలో ఈనెల 20వ తేదీ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో హిందీ వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ ప్రముఖ హిందీ నవలాకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకొని 'ప్రేమ్‌చంద్‌కి జీవని' అనే అంశంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 6303701314 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోకపోయినా పోటీ పరీక్ష రోజు నేరుగా కూడా వ్యాసరచన పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.
- డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

కార్మికుల సమ్మె బాట

కడప ముంగిట.. దాహం కేక

- 12 నుంచి ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె
- తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ బంద్
- ప్రజా సమస్యలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని సుమారు నెల రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్న కార్మికులు చివరి అస్త్రంగా సమ్మెబాట పట్టారు. దీంతో నగరంలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి సేవలు బంద్ అయ్యాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఆదివారం తాగునీటి సమస్యలు ఏర్పడ్డాయి. కొళాయిల్లో నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్ల కోసం పరుగులు పెడుతున్నారు. కడప నగర పరిధిలో సుమారు 400 మంది ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో కడప నగరానికి ప్రధానంగా తాగునీటిని సరఫరా చేసే గండి, లింగంపల్లి పంపింగ్ స్కీంల వద్ద ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాగునీరు, వీధి దీపాల నిర్వహణ కోసం నగరపాలక అధికారులు సచివాలయ ఉద్యోగుల ద్వారా తాత్కాలిక సిబ్బందిని నియమించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి సత్ఫలితాలను ఇవ్వలేదు.



సిద్ధవటం మండలం లింగంపల్లి పంపింగ్ స్కీమ్ వద్ద పోలీసు బందోబస్తు

పంపిణీ వ్యవస్థలో సమస్యలు ఉన్నాయి: ఎస్ఈ

తాగునీటి పంపింగ్ వ్యవస్థ సక్రమంగా ఉందని, ఫిట్టర్లు అంతా సమ్మెలోకి వెళ్లడంతో డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో సమస్యలు వస్తున్నాయని నగరపాలక ఎస్ఈ చెన్నకేశవరెడ్డి తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బందితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

లింగంపల్లి పంపింగ్ స్కీమ్ వద్ద పోలీసు బందోబసు

సిద్ధవటం : మండలంలోని లింగంపల్లి పెన్నానది నుంచి కడప నగరానికి పంపింగ్ స్కీమ్ ద్వారా వెళ్లే మంచినీటి ట్యాంకు వద్ద ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంటు ఏఈ అంజనీకుమార్, స్థానిక పోలీసులు రాఘవ, కిరణ్, కుమార్ పాల్గొన్నారు.

డిమాండ్లపై స్పందించని ప్రభుత్వం

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.24,500 వేతనాలు పెంచాలని, కార్మికుల రిటైర్‌మెంట్‌ను 62 ఏళ్లకు పెంచి, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతున్నా రు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించిన పాపాన పోలేదని కార్మికులు విమర్శిస్తున్నారు. 12వ తేది అర్ధరాత్రి నుంచి సమ్మె చేస్తామని ముందే తెలియజేసినప్పటికీ తమతో చర్చించి సమ్మె నివారణ యత్నాలు చేయలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులతో చర్చించి సమ్మె నివారణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చక్రస్నానం..సర్వపాపహరణం

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో చివరిఘట్టమైన చక్రస్నానం ఆదివారం వైభవంగా నిర్వహిచారు. ఆదివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడికి గ్రామోత్సవం.. వసంతోత్సవాల నడుమ జరిగింది. ఆలయంలో ఉత్సవమూర్తులకు గంధం, పాలు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలాలతో అభిషేకం భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు ఉత్సవమూర్తులకు కోనేటిలో చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానం అనేది బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైనది. కోనేటిలో స్వామి స్నానం ఆచరించిన తర్వాత మునిగిన వారి పాపాలు తొలగుతాయని, మోక్షం లభిస్తుందని పండితులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి వారికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



కోనేటిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నై రైళ్లు దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చెన్నై నుంచి అరక్కోణం మీదుగా వెళుతున్న గూడ్స్ రైలులో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పెట్రోలు, డీజిల్ ట్యాంకర్లు అగ్నికి ఆహూతి కావడంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో చెన్నై, తిరుపతి, బెంగుళూరు,కోయంబత్తూరువైపుగా వెళ్లే అన్ని రైళ్లను నిలిపివేశారు. కడప మీదుగా వచ్చే రైళ్లను గూడూరు, రేణిగుంట మీదుగా నడుపుతున్నట్లు రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైళ్లు దాదాపు 3-4 గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయని, ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

22 నుంచి రైతులకు శిక్షణ

ప్రొద్దుటూరు : మండలంలోని పశువైద్య కళాశాలలో ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు ఐదు రోజుల పాటు రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ ఒక ప్రటకనలో తెలిపారు. జాతీయ వ్యయసాయ పరిశోధన మండలి, హైదరాబాద్ జాతీయ వ్యవసాయ పరిశోధన యాజమాన్య సంస్థ సౌజన్యంతో ఎస్సీ రైతులకు 'సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడి పరిశ్రమ ఆవశ్యకత' అనే అంశంపై రైతులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనాలనుకునే రైతులు, గ్రామీణ నిరుద్యోగ యువత ఈనెల 17వ తేదీలోపు డాక్టర్ రాజకిశోర్ 8309339877 ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని వివరించారు.

క్లుప్తంగా

సిమెంట్ ట్యాంకర్ బోల్తా



వల్లూరు వద్ద బోల్తా పడ్డ సిమెంట్ ట్యాంకర్ లారీ

వల్లూరు : మండల పరిధిలోని ఏ ఓబాయపల్లె సమీపంలో సిమెంట్ ట్యాంకర్ బోల్తా పడటంతో.. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. యర్రగుంట్ల వైపు నుంచి కడప వైపు ఓ సిమెంట్ ట్యాంకర్ ఆదివారం వస్తుండగా.. కడప– తాడిపత్రి ప్రధాన రహదారిలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంతలో సమాచారం అందుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు తొలగించడానికి చర్యలు చేపట్టారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

దేశ స్థాయిలో ప్రతిభ చాటాలి



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్ : బాడీ బిల్డింగ్‌లో దేశ స్థాయిలో ప్రతిభ చాటాలని వైఎస్‌ఆర్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగర శివార్లలోని సాయి శ్రీనివాస గార్డెన్స్‌లో రాష్ట్ర స్థాయి ఓపెన్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్ –మూడవ మిస్టర్ ఆంధ్ర–2025 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తే తమ సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ బాడీ బిల్డింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాలోపాటు రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వైఎస్‌ఆర్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు గెలుపుపొందిన బాడీ బిల్డర్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్రంలో అన్ని జిల్లాల బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నూనే నాగేష్, జనరల్ సెక్రటరీ యూనస్ బాషా, చైర్మన్ కుమార్, కార్పొరేటర్ షఫీ, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులేసు

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన రైతు వెంకటశివ పొలంలో వేసుకున్న విద్యుత్ వైర్లు తగిలి.. చక్రాయపేట మండలం నడింపల్లె గ్రామానికి చెందిన ఇండ్లొల్ల ఓబులేసు (23) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి ఓబులేసు, శివ పక్షులు పట్టేందుకు వేటకు వెళ్లారు. పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు ఉండేది గమనించకుండా ఓబులేసు ముందుకు వెళ్లడంతో.. ప్రమాదవశాత్తు వైర్లు కాలికి తగులుకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఆదివారం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొహర్రం వేడుకల్లో అపశ్రుతి

కాశినాయన : మండలంలోని ఉప్పలూరులో మొహర్రం వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆ గ్రామంలో ఆదివారం పీర్లు బావికి వెళ్లాయి. పీర్లగుండాన్ని జేసీబీతో పూడుస్తుండగా.. ప్రమాదవశాత్తు గుండంలోని అగ్గి పక్కనే ఉన్న ప్రజలపై పడింది. ఈ సంఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన వారిని పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు.

పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారికి..

కన్నీటి వీడ్కోలు

త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారికి.. కన్నీటి వీడ్కోలు పలికారు. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బావమరదలు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలకు ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఆర్తనాదాలు మిన్నంటాయి. 'మీ పెళ్లి చేసి మురిసిపోదామనుకుంటే.. ఇలా జరిగిందేమిటి!'.. దేవుడా అంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు విషాద వదనంలో మునిగిపోయారు.



సాయికృష్ణ, అనిత (ఫైల్)

- రైల్వేకోడూరు రోడ్డు ప్రమాద మృతులకు ఘన నివాళి
- రెండు నెలల్లో వివాహం.. అంతలోనే మృత్యు ఒడికి
- మరణంలోనూ ఒక్కటై..
- శోక సముద్రంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

ఓబులవారిపల్లె : చిన్ననాటి నుంచి కలిసి పెరిగారు. యుక్త వయస్సు రాగానే ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి వివాహానికి సిద్ధమయ్యారు. రెండు నెలల్లో పెళ్లి.. అంతలోనే మృత్యుఒడికి చేరుకున్నారు. మరణంలోనూ వారు ఒకరికొకరు తోడుగా వెళ్లిపోయారు. రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి విషాద గాథ ఇది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని వైకోట రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ కండక్టర్ వనమాల శ్రీనివాసులు, వనమాల ప్రభావతికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు అజయ్ కృష్ణ, చిన్న కుమారుడు సాయి కృష్ణ. పెద్ద కుమారుడు అజయ్ చిట్వేలి గ్రామానికి చెందిన సాతుపాడి నాగయ్య నాల్గవ కుమార్తె మాధవిని వివాహం చేసుకున్నాడు. మాధవి తల్లిదండ్రులు ఇద్దరూ అప్పటికే చనిపోయి ఉండటంతో.. తన చిన్న చెల్లెలు అనితను చిన్నప్పుడే తనతోపాటు అత్తగారింటికి తీసుకొచ్చింది. అనిత ఇక్కడే హైస్కూల్‌లో చదివి పుల్లంపేటలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. నవమాల శ్రీనివాసులు రెండవ కుమారుడు సాయి కృష్ణ డిగ్రీ వరకు చదివాడు. చిప్పప్పటి నుంచి సాయి కృష్ణ, అనిత ఇద్దరూ కలిసి పెరగడంతో వారి మధ్య ప్రేమ చిగురించింది. పెద్దలు మొదట్లో ఒప్పుకోకపోయినా.. తర్వాత ఒప్పించి వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంకా రెండు నెలలకు అనిత మైనార్టీ తీరిన తరువాత వివాహం చేద్దామని పెద్దలు నిర్ణయించుకొని అన్ని సిద్ధం చేసుకున్నారు.

కబళించిన రోడ్డు ప్రమాదం

ఈ క్రమంలో విధి వీరి జీవితాలతో ఆడుకుంది. సాయికృష్ణ (24)కు రైల్వేకోడూరు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఇటీవల ఉద్యోగం వచ్చింది. చేరేందుకు స్కూటీపై శనివారం రైల్వేకోడూరుకు వెళ్లాడు. అక్కడ ఉండేవారు తిరుపతికి వెళ్లాలని చెప్పడంతో తిరుపతికి వెళ్లాడు. ఇంటి వద్ద ఉన్న మరదలు అనిత నంద్యాల డెమో రైలులో తిరుపతికి వెళ్లింది. ఇద్దరు కలిసి తిరుపతిలో ఉంటున్న అజయ్ కృష్ణతో మాట్లాడారు. సాయంత్రం అనిత, సాయికృష్ణ స్కూటీపై తిరుపతి నుంచి ఇంటికి బయలు దేరారు. రైల్వే కోడూరు మండలం శెట్టిగుంట సమీపానికి రాగానే.. వేగంగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఇద్దరిపై నుంచి లారీ వెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఓబులవారిపల్లిలోని ఆస్పత్రిలో ఆదివారం ఉదయం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలిసి మెలిసి మంచి వాడు అన్న పేరు ఉన్న సాయికృష్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతదేహాలను సర్పంచ్ ఎన్‌పీ జయపాల్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు



సంఘటన స్థలంలోనే మృతి చెందిన బావమరదలు

వైభవంగా హుసేనిపీర్ దర్గా ఉరుసు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గా వీధిలో వెలసిన హుసేనిపీర్ దర్గా 200వ ఉరుసు మహోత్సవాలు స్వామి ఐదవ తరం వారసులు మున్వర్‌బాషా, సలీం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా జరిగే ఈ ఉరుసు మహోత్సవంలో.. బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన హిందూ, ముస్లిలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు దర్గా ఆవరణలో అన్నదానం నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున స్వామి వారికి గంధం ఎక్కించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వామి వారసులు దర్గా రహమతుల్లా, దర్గా షఫీవుల్లా, దర్గా కరీముల్లా, ఆర్గనైజర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న స్వామి వారసులు, భక్తులు

ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీడే మ్యాచ్‌లు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు ఆదివారం వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కర్నూలు–నెల్లూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 74 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. ఆ జట్టులోని ద్రైవిక్ 58, రోహిత్ గౌడ్ 34 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సుశాంత్ 4, రిత్విక్ రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 26 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కడప–చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 38.4 ఓవర్లకు 139 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని లోకేష్ 56 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని తేజేష్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5, దినేష్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 51 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. ఎండి షారుఖ్ అక్తర్ 167 బంతుల్లో 27 ఫోర్లు, 7 సిక్సర్లతో 202 పరుగులు చేశాడు. తనీశ్వర్ టెండూల్కర్ 46 పరుగులు చేశాడు. దీంతో చిత్తూరు జట్టు 160 పరుగుల అధిక్యంలో ఉంది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.



చిత్తూరు షారుఖ్ అక్తర్ (202 పరుగులు)



చిత్తూరు తేజేష్ (5 వికెట్లు)



నెల్లూరు సుశాంత్ (4 వికెట్లు)

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్ : జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికల్లో కడప జిల్లాకు చెందిన పూర్వజ రెడ్డి అండర్–15, 17 విభాగాలలో సింగిల్స్ విజేతగా నిలిచి సత్తాను చాటినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు జిలానీబాషా తెలిపారు. ఆదివారం నగరంలోని డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–15 బాలుర విభాగంలో ప్రొద్దుటూరుకు చెందిన క్రీడాకారులు రాణించి మొత్తం జిల్లా జట్టులోని స్థానాలను కై వసం చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 15 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారన్నారు. అండర్–15, 17 విభాగాలలో జరిగిన ఈ ఎంపికలో బాలబాలికలకు విడివిడిగా సింగిల్స్, డబుల్స్‌లో పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్ సభ్యులు గంగాధర్, నాగరాజు డాక్టర్ ప్రతాప్ రెడ్డి, విశ్వనాథరెడ్డి జ్ఞాపికలను అందజేశారు.



రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్ 15 బాలురు జట్టు – డి.ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, చంద్రకిషోర్, పీబీజీ వర్షిత్ (ప్రొద్దుటూరు)

అండర్ 15 బాలికల జట్టు – ఎల్.పూర్వజరెడ్డి, బి.హరిణి, రితిక, కావ్య (కడప)

అండర్ 17 బాలుర జట్టు – వేద వ్యాస్ వర్మ, ఎల్ సుప్రీత్‌రెడ్డి (కడప) సి.విశ్వతేజ (ప్రొద్దుటూరు)

అండర్ 17 బాలికల జట్టు – రమ్యశ్రీ (ప్రొద్దుటూరు) ఎల్.పూర్వజ, కావ్య, రితిక (కడప)

డబ్బు బాకీ ఉన్నారని దంపతులపై దాడి

ఇద్దరు హిజ్రాలతో సహా నలుగురు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : డబ్బు బాకీ ఉన్నారని ఇంట్లోకి చొరబడి ఇద్దరు హిజ్రాలతోపాటు మరి కొందరు వ్యక్తులు దంపతులపై దాడికి పాల్పడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈశ్వరరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న గైబూసా బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని భార్య హబీబున్నీసా డబ్బు బాకీ ఉందనే కారణంతో.. వదిన అయిన గౌషియా కొన్ని రోజులుగా ఆమెతో గొడవ పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 11న గౌషియాతోపాటు కుమారుడు, కుమార్తె, ఇద్దరు హిజ్రాలతో కలసి హబీబున్నీసా ఇంటికి వెళ్లారు. డబ్బు ఇస్తారా లేదా అని గొడవ పడి ఇంట్లోని వస్తువులన్నీ పగులగొట్టారు. దాడి చేయడంతో గైబూసా దంపతులు గాయపడ్డారు. అంతటితో ఆగక కబోర్డును పగులకొట్టి అందులో ఉన్న 150 గ్రాముల బంగారును తీసుకెళ్లారు. ఇంటి బయట నిలిపిన రెండు బైక్‌లను కూడా తీసుకెళ్లారు. ఈ విషయమై గైబూసా శనివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు రాత్రి పొద్దుపోయాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులోని నిందితులు గౌషియా, ఆమె కుమారుడు కరీం, ఇద్దరు హిజ్రాలు రాజారెడ్డి, శ్యామలను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

ఇల్లు ఖాళీ చేయించారని..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు క్రైం : పులివెందులకు చెందిన టీడీపీ నాయకుడి మనుషులమంటూ కొందరు వ్యక్తులు.. ఓ ఇంట్లోకి ప్రవేశించి భార్యా భర్తలపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. అలాగే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. దీంతో దంపతులిద్దరూ ప్రాణభయంతో బంధువుల ఇంట్లో తలదాచుకున్నారు. తిరిగి భర్తపై దాడి చేయడంతో తీవ్ర మనస్థాపం చెందిన భార్య ఆత్మహత్యకు ప్రయత్నించింది. బాధితుడు మల్లికార్జునుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రమాదేవి మిట్టమడివీధిలో నివాసం ఉంటున్నారు. తమకు తెలిసిన సందీప్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి డబ్బు అవసరం కావడంతో.. తమ ఇంటిని 2014లో ఇద్దరు వ్యక్తులకు కుదవ పెట్టి రూ. 23 లక్షలు తీసుకున్నారు. ఈ మొత్తాన్ని సందీప్‌కుమార్‌రెడ్డికి ఇచ్చారు. ఆరు నెలల్లో డబ్బు ఇస్తానని చెప్పిన అతను.. తర్వాత పత్తా లేకుండా పోయాడు. తాము మోసపోయామని, తీసుకున్న మొత్తం ఇస్తామని చెప్పినా ఇంటిని తనఖా పెట్టుకున్న వ్యక్తులు అంగీకరించలేదు. అప్పటి నుంచి ఇంటికి సంబంధించిన పంచాయితీ నడుస్తూనే ఉంది. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్ నెలలో సింహాద్రిపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వారి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లోని వస్తువులన్నీ ధ్వంసం చేశారు. ప్రమీలాదేవి దంపతులను బెదిరించి వారిపై దాడి చేశారు. ఇంటి నుంచి బయటికి పంపించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దంపతులపై దాడి చేయడంతో..

ఇదిలా ఉండగా సింహాద్రిపురం మండలానికి చెందిన ఒక వ్యక్తి చొరవతో ప్రమీలాదేవి దంపతులు తిరిగి వారి ఇంట్లోకి వెళ్లారు. అయితే రెండు రోజులు కూడా గడవక ముందే.. గతంలో దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు వచ్చి తిరిగి వారిపై దాడి చేశారు. ఇంటికి తాళం వేసి వాళ్లను బయటకు గెంటేశారు. దీంతో ప్రమీలాదేవి దంపతులు ప్రాణభయంతో పోట్లదుర్తిలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మల్లికార్జునుడు మరో వ్యక్తితో కలిసి ప్రొద్దుటూరులోని మున్సిపల్ పార్కు వద్దకు వెళ్లాడు. సింహాద్రిపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికి రావడంతో మల్లికార్జునుడు వారిని చూసి భయంతో పరుగులు తీశాడు. ఈ విషయాన్ని అతను భార్య ప్రమీలాదేవికి చెప్పగా భయం, మనస్తాపంతో అదే రోజు రాత్రి ఆమె వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమీలాదేవి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై బాధితులు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు.

న్యాయం చేయాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు వేడుకోలు

రెండు రోజుల క్రితమే ప్రమీలాదేవి ఒక సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తమకు న్యాయం చేయాలంటూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను వేడుకున్నారు. డబ్బులు కడతామని చెప్పినా సింహాద్రిపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. మూడంతస్తుల ఇంటిని స్వాధీనం చేసుకొని దౌర్జన్యంగా బయటికి గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ ఏడాది నుంచి ఎన్నో సార్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని ఆమె రోదించసాగారు. ఎవరూ తనకు న్యాయం చేయలేదని, తాను చివరి స్టేజీలో ఉన్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెబుతూ విలపించారు. నిజానిజాలు తెలుసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు. తర్వాత రెండు రోజులకే ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేశారు.

నేనెప్పుడు వాళ్లను స్టేషన్‌కు పిలిపించలేదు

ఈ విషయమై వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా.. ప్రమీలాదేవి దంపతులను తానెప్పుడు స్టేషన్‌కు పిలిపించలేదన్నారు. తాను రాకముందు నుంచి వారి ఇంటికి సంబంధించిన సమస్య నడుస్తోందని తెలిపారు. తాను ఎవ్వరినీ కొట్టలేదని సీఐ వివరణ ఇచ్చారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీలాదేవి

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నలపరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రహమత్ అనే మహిళ (24) ఈ నెల 7వ తేదీన కడపు నొప్పి తాళలేక పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమెను చికిత్స కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఢీకొన్న కార్లు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని కడప రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం ఎదురుఎదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే కారులో ఉన్న వారు మీది తప్పు, అంటే కాదు మీది తప్పు అని వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తర్వాత పోలీసులు వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సమస్యను పరిష్కరించారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి బంగారు ఆభరణాలు, వర్ణమైన పుష్పమాలతో అలంకరించారు. ముందుగా అర్చకులు విశ్వసేన పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహ వచనం, కుంకుమపూజ, యజ్ఞోపవీత ధారణ, మధుపర్కం పట్టు వస్త్ర సమర్పణ, కన్యాదానం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, అక్షతరూపణ, మాలమార్పిడి, వారణమయి మహానివేదనం, కర్పూర హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఒంటిమిట్ట సమీప ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఒంటిమిట్ట మండల ప్రత్యేక అధికారి బ్రహ్మయ్య, ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎంపీపీ లక్ష్మీదేవి దంపతులు, అర్చకులు, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కడప పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర పాలక సంస్థ పరిధిలోని సాయిపేట 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ నెల 10వ తేదీన నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ (మెగా పీటీఎం 2.0) సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు సంబంధించిన ఫొటో ఫ్రేమ్ రూపకల్పనలో పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన చిత్రానికి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం లభించింది. దీనికి సంబంధించి సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర పోర్టల్‌లో ముఖచిత్రంగా ఏర్పాటు చేశారు. దీంతోపాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల ఫొటో చిత్రాన్ని తన స్టేటస్‌తోపాటు సామాజిక మాధ్యమాల్లో ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాది నాగరాజుతోపాటు ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.



సమగ్రశిక్ష రాష్ట్ర స్థాయి పోర్టల్‌లో ముద్రించిన సాయిపేట ఆదర్శ పాఠశాల ముఖచిత్రం

మూఢనమ్మకాలు వీడాలి.. శాస్త్రీయంతో ముందుకెళ్లాలి

కడప ఎడ్యుకేషన్ : మూఢ నమ్మకాలు వీడి, శాస్త్రీయ ఆలోచనలతో ముందుకెళ్లాలని జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు బి.విశ్వనాథ్ పేర్కొన్నారు. కడప ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ సురేష్‌కుమార్ అధ్యక్షతన జేవీవీ రాష్ట్ర మహాసభలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన సమావేశంలో బి.విశ్వనాథ్ మాట్లాడుతూ నేటి స్పీడు యుగంలో కూడా చేతబడుల వంటి మూఢాచారాలతో ప్రాణాలను తీయడం వంటి సంఘటనలు బాధాకరమని అన్నారు. ముఖ్యంగా మేధావులు, ఉపాధ్యాయ, అధ్యాపకులు మూఢాచారాల నిర్మూలనలో ప్రధాన భూమిక పోషించాలని అన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్నటువంటి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక పోరాడుతోందన్నారు. ముఖ్యంగా బాలబాలికల సంపూర్ణ ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ తదితరాల కోసం జేవీవీ ఎనలేని కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర కోశాధికారి పి.సనావుల్లా మాట్లాడుతూ భవిష్యత్తులో జన విజ్ఞాన వేదిక అవసరం సమాజానికి మరింతగా ఉందన్నారు. నేటి యువతరం ముందుకు వచ్చి జేవీవీ ఆశయాల సాధనకు కృషి చేయాలని తెలిపారు. జేవీవీ సలహా మండలి సభ్యులు కె.సురేష్‌బాబు, ప్రముఖ వైద్యులు ఫారుఖ్, రామగోపాల్, రాజా వెంగళరెడ్డి, ఓబుల రెడ్డి, రమణయ్య, అశోక్ కుమార్, అవ్వారు అర్జున్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యపరంగా మూఢనమ్మకాలు చాలా ప్రమాదకరమని, అనారోగ్యం వస్తే తక్షణమే సరియైన చికిత్స తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రామారావు, మురళీధర్, సుదర్శన్, వరలక్ష్మి, మీన, సుజాత, స్వరాజ్యలక్ష్మి తదితరులు మాట్లాడారు. మహాసభల్లో జేవీవీ రాష్ట్ర నాయకులు పి.సుబ్బరాజు నరసింహారెడ్డి, సుబ్బారావు, బాలాజీ, జిల్లా నాయకులు రాంబాబు, భాస్కర్, శ్రీరాములు, నాగార్జునరెడ్డి, సుధాకర్, గౌరీశంకర్, ఎల్లేశ్వరరావు, మహబూబ్‌బాషాతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల జేవీవీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జేవీవీ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు సుబ్బరాజు

అశ్వవాహనంపై చెన్నకేశవుడు

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అశ్వవాహనంపై శ్రీ చెన్నకేశవస్వామి దర్శనమిచ్చారు. అలాగే శ్రీ సిద్దేశ్వరస్వామికి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామ వీధుల్లో భక్తులు స్వామివార్లకు కాయకర్పూరం సమర్పించుకున్నారు. పార్వేటి ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

నేడు ధ్వజావరోహణం

శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలకు సోమవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించనున్నారు.

సెయింట్ లూయిస్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి

రాజంపేట : యూఎస్ఏలోని సెయింట్ లూయిస్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ యువనేత చిల్లా కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, ఆయన మానవతాస్ఫూర్తి గురించి కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు మాట్లాడారు. గతంలో 2007లో వైఎస్సార్ సెయింట్ లూయిస్ పర్యటనలో ఇదే కన్వెన్షన్ హాల్‌లో పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడారని ప్రవాసాంధ్రులు గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకల్లో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, కడప మోహన్‌రెడ్డి తమ మధుర జ్ఞాపకాలను, వైఎస్సార్ జీవితంలో చిరస్మరణీయ ఘట్టాలను పంచుకున్నారు. వైఎస్సార్ జయంతి సభ వీక్ ఎండ్స్‌లో చేయాల్సి వచ్చిందన్నారు. చికాగో, మెంఫిస్, కాన్సాస్ వంటి నగరాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారన్నారు. సభలో కన్వీనర్ సుబ్బారెడ్డి, పమ్మి, సందీప్, రాఘవరెడ్డి, నవీన్, గూడువల్లి, మహేష్, గోపాల్, తాటిపర్తి, ఆర్కే తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న యూఎస్ఏ వైఎస్సార్ అభిమానులు, నాయకులు